సాక్షి బాపట్ల

మంగళవారం । 6 । జూన్ । 2023



మహంకాళీ గుడి హుండీ లెక్కింపు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులోని మహంకాళి అమ్మవారి గుడి హుండీల ఆదాయం రూ.16,16,352 వచ్చింది.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,000, గరిష్ట ధర రూ.3,400, మోడల్ ధర రూ.2,600 వరకు పలికింది.



దుర్గమ్మ సన్నిధిలో భారతీ స్వామి

విజయవాడపశ్చిమ: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను కర్ణాటక శివగంగలోని శృంగేరీ పాలిత శివగంగ పీఠం పీఠాధిపతి పురుషోత్తమ భారతీ స్వామిజీ సోమవారం దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

రేపు పర్చూరుకు త్రిదండి చినజీయర్ స్వామి రాక

పర్చూరు (చినగంజాం): శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి పర్చూరుకు రానున్నట్లు అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పర్చూరుకు చెందిన ఆలా అనిల్‌కుమార్ దంపతులు ఇచ్చిన రూ.15 లక్షల విరాళంతో కపి స్థలంలోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో నూతన కల్యాణ మండపాన్ని నిర్మించగా దాని ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా చిన జీయర్ స్వామి వస్తున్నారని సభ్యులు తెలిపారు. 7వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోట హరిప్రసాద్, రంగిశెట్టి ఆంజనేయులు, తులసి శివనాగేశ్వరరావు, కఠారి సురేంద్ర, తులసి అప్పారావు కోరారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ బి.మనోరంజని పేర్కొన్నారు. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 30 మంది బాల కార్మికులను గుర్తించామని, వీరిలో 28 మందిని వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించామని, మిగిలిన ఇద్దరికి తాత్కాలిక వసతి గృహంలో ఆశ్రయం కల్పించామని వివరించారు. ఆమె మాట్లాడుతూ గుర్తించిన బాల కార్మికులను పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు వెల్లడించారు.

కానుకలు కురి'పించెను'




నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. వలంటీర్లు ఇంటి ముంగిటకే వెళ్లి లబ్ధిదారులకు నగదు అందించారు. సోమవారం సాయంత్రం నాటికి 98.91 శాతం పంపిణీ పూర్తయింది. ఈనెలలో 2,51,264 మంది లబ్ధిదారులు ఉండగా ప్రభుత్వం రూ.69.02 కోట్లు కేటాయించింది. సోమవారం సాయంత్రానికి 2,48,517 మంది లబ్ధిదారులకు రూ.68.26 కోట్లు అందజేశారు.

పిల్లల్లో అతిసార నియంత్రణకు కృషి


నరసరావుపేట: జిల్లాలో సోమవారం నుంచి 17వరకు ఐదేళ్ల లోపు పిల్లల్లో అతిసార నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో కార్యక్రమ వాల్‌పోస్టర్, కరపత్రాలను వైద్యాధికారులతో కలిసి జేసీ ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి మాట్లాడుతూ పరిసరాలు, తాగునీరు, చేతులు శుభ్రపర్చుకునే విధానం తదితర ఆరు దశల గురించి, గృహాలలో లభ్యమయ్యే ఫ్లూయిడ్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, మాతా శిశుసంరక్షణ అధికారి డాక్టర్ నాగపద్మజ, జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణ అధికారి డాక్టర్ బీవీ రంగారావు, డీఆర్వో కె.వినాయకం పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 520.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు వచ్చే నీటి చేరిక పూర్తిగా నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.60 అడుగుల వద్ద ఉంది.

అమరేశ్వరస్వామి ఆలయం ఈఓగా వేముల గోపి



పెదకూరపాడు: అమరావతి బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా వేముల గోపి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఈవో సునీల్ ఉండవల్లి గ్రూపు టెంపుల్‌కు బదిలీ అయ్యారు. కోటప్పకొండ ఈఓగా ఉన్న వేముల గోపి అమరేశ్వరస్వామి దేవస్థానానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వేముల గోపి మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి, సదుపాలయ కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

అమ్మ ఒడి ఆలంబన

పేదింటి పిల్లలు ఉత్తమ విద్యను 'ఒడి'సి పట్టేందుకు.. పేదరికాన్ని ఓడించేలా వారి భవితను తీర్చిదిద్దేందుకు.. సర్కారు బడి అంటే ఉన్న చిన్నచూపును పారదోలి ఉత్తమ విద్యాగుడిగా మార్చేందుకు .. డ్రాప్ అవుట్స్‌కు ఫుల్‌స్టాప్ పెట్టి హాజరు పెంచేందుకు.. ప్రభుత్వం తీసుకొచ్చిన ఉత్తమ పథకం 'అమ్మ ఒడి'. నాడు–నేడు ద్వారా విద్యారంగంలో సమూల మార్పులు చేస్తూ, సీబీఎస్‌ఈ సిలబస్.. ఇంగ్లిష్ విద్యతో ఉత్తమ బోధన చేస్తూ.. సర్కారు బడులు సైతం నో అడ్మిషన్స్ బోర్డు పెట్టేలా గొప్ప మార్పునకు శ్రీకారం చుట్టింది. ఈ మార్పులకు గత మూడేళ్లుగా అమ్మ ఒడి ఊతమిస్తుండగా.. ఈఏడాది సైతం ప్రతి తల్లి కొంగుముడి కానుంది.

అమ్మ కొంగు బంగారం..
అమ్మ ఒడి పథకం

- జిల్లాలో 2021–2022 విద్యా సంవత్సరంలో 1,19,953 మందికి వర్తింపు
- తల్లుల ఖాతాల్లో రూ155.93 కోట్లు జమ
- నాలుగో విడత పంపిణీకి సన్నాహాలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



మూడో విడత అమ్మ ఒడి కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున (ఫైల్)

బాపట్ల అర్బన్: ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలంటే చిన్నచూపు. తల తాకట్టు పెట్టయినా పిల్లలను కార్పొరేట్ బడికి పంపిస్తే .. వాళ్లయినా కూలీలుగా మారకుండా ఉంటారని తల్లిదండ్రులు ఆశించేవారు. గత తెలుగుదేశం ప్రభుత్వం కార్పొరేట్‌కు పట్టం కట్టి ప్రభుత్వ పాఠశాలలను శిథిలావస్థకు చేర్చింది. దీంతో ప్రభుత్వ విద్య మిథ్యగా మారింది. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో అమ్మఒడి పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఇది ప్రభుత్వ విద్యపై ప్రజల్లో ఉన్న అపోహలను దూరం చేసింది.

డ్రాపవుట్స్‌కు చెక్..

గత ప్రభుత్వంలో ప్రతి ఏటా వందల సంఖ్యలో సర్కారు పాఠశాలల నుంచి డ్రాపవుట్స్ ఉండేవి. ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. జిల్లాలోని బాపట్ల మున్సిపల్ పాఠశాల వంటి అనేక ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు ఫుల్ అనే బోర్డులు వేలాడుతున్నాయి. ఇది ప్రభుత్వ విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పునకు సంకేతం.

జూన్.. ఇక నో టెన్షన్

ప్రతి ఏటా జూన్ మాసంలో విద్యార్థుల ఫీజుల కోసం తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జూన్ మాసంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నారు. దీంతో తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు జమవుతున్నాయి. ఇవి విద్యార్థుల చదువులకు ఆలంబనగా మారుతున్నాయి. మేనమామ ఇచ్చిన విద్యా కానుక అందుకున్న పిల్లలు .. హుషారుగా పాఠశాలకు వెళుతుంటే తల్లిదండ్రులు మురిసిపోతున్నారు. బాపట్ల జిల్లాలో మొత్తం1820 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో అమ్మఒడికి 2021–2022 లో అర్హులైన 1,19,953 మంది 1 నుంచి 10వరకు చదివే విద్యార్థులు ఉన్నారు.

జిల్లాలో ఈ మూడు సంవత్సరాలలో లబ్ధి..

- 2019–2020లో 1,14,550 విద్యార్థులకు రూ. 171.82 కోట్లు
- 2020–2021లో 1,16,019మంది విద్యార్థులకు రూ. 162.42 కోట్లు
- 2021–2022లో 1,19,953 మంది విద్యార్థులకు రూ. 155.93 కోట్లు.

జగనన్నకి రుణపడి ఉంటాం



మా అమ్మాయికి అమ్మ ఒడి అందుతుంది. జగనన్న మాలాంటి పేదలకోసం ప్రవేశపెట్టిన మిగతా పథకాల వలే అమ్మ ఒడి కార్యక్రమం చాలా బాగుంది. పిల్లల భవిష్యత్తు మీద మాకు నమ్మకం కలిగింది. జగనన్నకు రుణపడి ఉంటాం. ఈసారి కూడా జగనన్నే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నా.

– బొడపాటి నాగరాణి, బాపట్ల

దేశంలో ఎక్కడా లేదు



దేశంలో ఎక్కడా లేనివిధంగా విద్యా వ్యవస్థలో పెనుమార్పులు తెచ్చారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. విద్యా వ్యవస్థలో నాడు–నేడు, అమ్మ ఒడి విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద ఇలాంటి మంచి కార్యక్రమాలు ప్రభుత్వం చేస్తుంది.

– పి.వి.జె.రామారావు, జిల్లా విద్యా శాఖ అధికారి

'జగనన్నకు చెబుదాం' ప్రతిష్టాత్మకం

- ఫిర్యాదులపై స్పందించకపోతే చర్యలు
- అధికారులతో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



స్పందనలో అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

బాపట్ల: జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, పోర్టల్‌లో నమోదయ్యే ఫిర్యాదులను పట్టించుకోకపోతే అధికారులపై కఠినచర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా హెచ్చరించారు. స్పందన కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌ని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు అర్జీల ద్వారా తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. తన పరిధిలోని వాటికి కలెక్టర్ తక్షణమే పరిష్కారమార్గం చూపగా మిగిలినవి వాటిని పరిశీలించి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం పోర్టల్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి నేరుగా ఫిర్యాదులు వెళుతున్నాయనే విషయాన్ని అధికారులు గుర్తించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. గడువులోగా అర్జీలను పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. గడువు దాటేవరకు ఉండరాదన్నారు. జగనన్నకు చెబుదాం పోర్టల్లో వచ్చే అర్జీల పట్ల నిర్లిప్తంగా ఉంటే సహించేది లేదన్నారు. పలువురికి షోకాజ్ నోటీసులు జారీచేయాలని కలెక్టరు ఆదేశించారు. పంచాయితీశాఖ, విద్యుత్‌శాఖ, పోలీస్ శాఖకు సంబంధించి అధికంగా అర్జీలు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు వచ్చిన అర్జీలపై సంబంధిత శాఖల వారీగా ఆయన సమీక్షించారు. ఆయా శాఖలలో నమోదయ్యే అర్జీల పరిష్కారం పర్యవేక్షించడానికి కమాండ్ కంట్రోల్ రూమ్ సమర్థంగా పనిచేయాలన్నారు.

ప్రతి దస్త్రం ఈ–ఆఫీసులో..

కలెక్టరేట్‌కు వచ్చే ప్రతిదస్త్రం ఈ–ఆఫీస్ విధానంలో అధికారులు పంపాలని కలెక్టర్ జిల్లాలోని అన్ని శాఖల అధికారులను పి.రంజిత్ బాషా ఆదేశించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని అధికారులు సులభతరంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో ఈ–ఆఫీస్ విధానం పక్కాగా అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని నిలదీశారు. జిల్లా అధికారులందరికి డిజిటల్ కీ ఉండాలని ఆయన స్పష్టం చేశారు. డిజిటల్ కీ లేనివారు, ఈ–ఆఫీస్ పై అవగాహన లేని వారికి ప్రత్యేక శిక్షణలు ఇవ్వాలని సాంకేతిక నిపుణులను ఆదేశించారు. అతిసార నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సురక్షిత నీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ, గ్రామీణనీటి సరఫరా శాఖల అధికారులు సమన్వయంతో పక్షోత్సవాలు నిర్వహించాలన్నారు. అనంతరం 110 మంది గర్భిణులకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో హైజెన్ కిట్లను కలెక్టర్ అందజేశారు. జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, డీఆర్‌ఓ లక్ష్మీశివజ్యోతి, జిల్లా అధికారులు, రెడ్ క్రాస్ సెక్రటరీ నారాయణభట్టు తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే కోన రఘుపతి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌బాబు

బాపట్ల: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామని బాపట్ల పార్లమెంటు సభ్యుడు నందిగం సురేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సూర్యలంక వద్ద ఎంపీ నందిగం సురేష్, బాపట్ల ఎమ్మెల్యే రఘుపతి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా, వాటి సంరక్షణ కూడా చేపట్టాలన్నారు. జిల్లాలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపు నిచ్చారు. మడ అడవుల అభివృద్ధి మత్స్యకారుల జీవితానికి భరోసా అన్నారు. తుపానుల తీవ్రతను మడ అడవులు తగ్గిస్తాయన్నారు. తీరప్రాంతాలు ఎకో టూరిజం అభివృద్ధికి వీలుగా ఉన్నాయన్నారు. రాబోయే తరాల భవిష్యత్తు కోసం విద్యుత్, నీరు ఆదా చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, ఎలక్ట్రానిక్ వస్తువుల వృథాను తగ్గించడం, సమగ్ర ఆహార వినియోగం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం శ్రద్ధ పెట్టిందన్నారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ సూర్యలంక ప్రాంతం అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. సూర్యలంకను ఎకో టూరిజం ప్రాంతంగా తయారు చేసేందుకు డీపీఆర్‌లు సిద్ధం చేయాలని సూచించారు. అటవీశాఖ గుంటూరు రేంజ్ చీఫ్ కన్జర్వేటర్ వై. శ్రీనివాసుల రెడ్డి, భారత ప్రభుత్వ అటవీశాఖ ప్రతినిధి బాలాజీ, బాపట్ల జిల్లా అటవీశాఖ అధికారి ఎల్.భీమయ్య పాల్గొన్నారు.

మృత్యు వేగం

- ట్రాక్టర్ బోల్తాపడి ఏడుగురు దుర్మరణం
- మృతులంతా మహిళలే
- కొండేపాడు ఊరంతా విషాదం
- 22 మందికి గాయాలు
- శుభకార్యానికి వెళ్తుండగా దుర్ఘటన
- డ్రైవర్ అతివేగమే కారణం

ఆనందాలు అంతలోనే ఆవిరయ్యాయి. అప్పటివరకు చెప్పుకున్న ముచ్చట్లు ఆర్తనాదాలయ్యాయి. బంధువుల ఇంట శుభకార్యానికి సంతోషంగా బయలుదేరిన ఆ కుటుంబాల్లో పెను విషాదం రేగింది. ఏడు ప్రాణాలు మృత్యుఒడిలో బోల్తాపడ్డాయి. మరో 22 మంది క్షతగాత్రులయ్యారు. ఈ హృదయ విదారక ఘటన ప్రత్తిపాడు మండలం వట్టిచెరుకూరు వద్ద జరిగింది. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగం వల్ల కొండేపాడు ఊరుఊరంతా విషాదంలో మునిగిపోయింది.



దుర్ఘటనలో మరణించిన వారిని ట్రాక్టర్ ట్రక్కులో గుంటూరు జీజీహెచ్‌కు తరలిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు/నగరంపాలెం (గుంటూరు వెస్ట్): కొండేపాడు దళితవాడకు చెందిన సుమారు 30 మందికి పైగా మహిళలు సోమవారం మధ్యాహ్నం పొన్నూరు మండలం జూపూడిలో పుష్పాలంకరణ వేడుకకు వెళ్లేందుకు ట్రాక్టర్‌పై బయల్దేరారు. డ్రైవర్ వాహనాన్ని అతివేగంగా నడపటంతో అదుపుతప్పి వట్టిచెరుకూరు శివారు పెట్రోలు బంకు సమీపంలో పక్కనున్న కాలువలోకి దూసుకెళ్లి తిరగబడింది. దీంతో ట్రాక్టర్ ట్రక్కు కింద నలిగిపోయి మిక్కిలి నాగమ్మ (55), గనికపూడి మేరమ్మ (50), గనికపూడి రత్నకుమారి (55), కట్టా నిర్మల (55), గనికపూడి సుహాసిని (40), మామిడి ఝాన్సీ రాణి (46) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన గనికపూడి సలోమి (55)ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందింది.

ఉపాధి పనులకు వెళ్లి వచ్చి..

గ్రామంలోని దళితవాడకు చెందిన 30 మంది మహిళలు ఉదయం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు వెళ్లారు. పనుల అనంతరం పుష్పాలంకరణ వేడుకకు వెళ్లాలని ముందుగానే నిర్ణయించుకున్నారు. మధ్యాహ్నం గ్రామం నుంచి ట్రాక్టర్‌లో బయల్దేరారు. అప్పటికే ఎండతీవ్రత ఎక్కువగా ఉండటంతో మార్గమధ్యలో రోడ్డు పక్కన ట్రాక్టర్‌ను నిలిపి సోడాలూ తాగారు. ఆపై ముందుకు కదిలిన నిమిషాల వ్యవధిలోనే ఘోర ప్రమాదం జరిగింది.



ప్రమాద స్థలంలో క్షతగాత్రుల హాహాకారాలు

ప్రాణనష్టం తగ్గించిన పొక్లెయినర్

ప్రమాదం జరిగిన సమయంలో ట్రాక్టర్‌లో 30 మందికిపైగా ఉన్నారు. ఒక్కసారిగా ట్రాక్టర్, ట్రక్కు బోల్తా పడటంతో సుమారు ఇరవై మందికిపైగా ట్రక్కు కింద చిక్కుకుపోయారు. ఆ సమయంలో పెట్రోల్ బంకు పక్కనే పొక్లెయినర్ ఉండటంతో స్థానికులు దాని సాయంతో ట్రక్కును పైకిలేపి వెంటనే క్షతగాత్రులను బయటకు తీశారు. లేకుంటే మృతుల సంఖ్య మరింత పెరిగేదని స్థానికులు చెబుతున్నారు.

దూకేసిన ట్రాక్టర్ డ్రైవర్..

ట్రాక్టర్ నుంచి పక్కకు దూకేసి డ్రైవర్ తన ప్రాణాలను కాపాడుకున్నాడు. అతివేగం వల్ల ఒక్కసారిగా వాహనం అదుపుతప్పడంతో ప్రాణభయంతో ట్రాక్టర్ నడుపుతున్న 23 ఏళ్ల యువకుడు స్టీరింగ్ వదిలేసి, రోడ్డుపైకి దూకేశాడు. స్వల్పంగా గాయపడిన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోదనలతో మిన్నంటిన జీజీహెచ్

గుంటూరు జీజీహెచ్ మృతుల కుటుంబీకుల రోదనలతో మిన్నంటింది. తల్లి చనిపోయిందని ఒకరు, సోదరి మరణించిందని మరొకరు గుండెలవిసేలా రోదించారు. స్ట్రెచర్లపై నిర్జీవంగా పడిఉన్న మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఈ దృశ్యాలు చూపరుల హృదయాలను ద్రవింపజేశాయి.

ప్రజాప్రతినిధుల పరామర్శ

జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మాజీ హోంమంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, గుంటూరు డెప్యూటీ మేయర్లు బాలవజ్రబాబు, షేక్ సజిలా, వైఎస్సార్ సీపీ నేత మేకతోటి దయాసాగర్ తదితరులు ఆస్పత్రికి వచ్చి బాధితులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాలను పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించే వరకు అక్కడే ఉండి వైద్యులు, పోలీసులకు సూచనలు చేశారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జిల్లా యంత్రాంగం అంతా జీజీహెచ్ వద్దే

కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ పలువురు జిల్లా అధికారులు జీజీహెచ్ వద్దకు చేరుకున్నారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటికప్పుడు తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. వైద్యాధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉండేలా పర్యవేక్షించారు.

క్షతగాత్రుల పరిస్థితి మెరుగ్గానే..

22 మంది క్షతగాత్రుల పరిస్థితి మెరుగ్గానే ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రభావతి తెలిపారు. సాధ్యమైనంత త్వరగా కోలుకునే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. మెరుగైన చికిత్స అందిస్తున్నట్టు వివరించారు.

గాయపడిన వారు..

ప్రమాదంలో 22 మంది గాయపడ్డారు. జి.బుజ్జి, డి.వర్ధిని, జె.కుమారి, ఎం.పద్మ, ఎం.వజ్రమ్మ, ఆర్.సుబ్బమ్మ, జి.సుజాత, జె.ఆనందకుమారి, ఎన్.నాగమ్మ, ఎం.అరుణకుమారి, డి.ఉషారాణి, జి.కాంతమ్మ, ఎం.విక్టోరియా, ఎం.సుజాత, ఎం.హన్సిక, జి.రత్నకుమారి, కె.ఆనందమ్మ, జె.సంతోషమ్మ, డి.జయమ్మ, ఏసుమణి, కె.కుసుమ, డి.కరుణకుమారి గాయపడినవారిలో ఉన్నారు. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనాల్లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

దురదృష్టకర ఘటన : అంబటి

జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఘటన చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు.

కలచివేసిన ఘటన : సుచరిత

మాజీ హోంమంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత మాట్లాడుతూ ఏడుగురి మృతి కలచివేసిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని, మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్ప గాయాలైన వారికి రూ.25 వేలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని వివరించారు. బాధితులకు తక్షణమే ఆదుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించేలా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారని సుచరిత వెల్లడించారు.



బోల్తాపడిన ట్రాక్టర్

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

బాపట్లటౌన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ టి.వెంకటేశులు తెలిపారు. సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ ఏర్పాటుచేసిన పోస్టర్లు సోమవారం బాపట్ల డీఎస్పీ కార్యాలయం ఆవరణంలో ఆవిష్కరించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఏ విధమైన లోన్‌యాప్‌ల జోలికి వెళ్లవద్దన్నారు. ఆధార్‌కార్డులపై జరిగే మోసాలపై జాగ్రత్తలు వహించాలన్నారు. పట్టణ సీఐ పి.కృష్ణయ్య, ఎస్ఐ సింగయ్య, ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

'జలజీవన్' పనుల్లో నిర్లక్ష్యం తగదు

- ఇంజినీరింగ్ అధికారులు తీరుమార్చుకోవాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: గ్రామాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి జల జీవన్ మిషన్ పనులు శరవేగంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పనులు త్వరగా పూర్తి చేయగలిగితే గ్రామాలలో శాశ్వతంగా మంచినీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. డివిజన్, జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపంతోనే పనులు పురోగతి లేకుండా పోయిందన్నారు. బాపట్ల జిల్లాలో రూ.కోట్ల మేర పనులు జరిగినప్పటికీ బిల్లులు సమర్పించడంలో ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. నిధుల కొరత లేకపోయినప్పటికీ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయకపోతే పురోగతి ఎలా సాధిస్తారంటూ మందలించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.22 కోట్ల విలువైన పనులు జరిగాయన్నారు. రూ.9 కోట్ల పనులకు ఇంతవరకు బిల్లులు సమర్పించకపోవడంపై అధికారులను నిలదీశారు.

నీటి సరఫరాలో చిత్తశుద్ధి ఉండాలి..

గ్రామాలలో తాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. వేసవిలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని అసహనం వ్యక్తం చేశారు. అద్దంకి నియోజకవర్గంలో రూ.7.78 కోట్ల విలువైన పనులు మంజూరు కాగా కేవలం 25శాతం పనులు జరగడం ఏమిటని ప్రశ్నించారు. రూ.1.20కోట్ల పనులకు బిల్లులు చేయకపోవడంపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారిని ఆయన ఆదేశించారు. గ్రామీణ నీటిసరఫరా విభాగం ఎస్ఈ బెనహర్, డీపీఓ రమేష్, కార్య నిర్వాహక ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు, ఏఈలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం..

ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రతినిధుల పాత్ర చాలా కీలకమైనదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ప్రజా పరిషత్ సభ్యులకు స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రంలో వారం రోజుల పాటు జరగనున్న శిక్షణా తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. జడ్పీటీసీల అధికారాలు, పరిధులు తెలుసుకోవాలన్నారు. విస్తరణ శిక్షణా కేంద్రం ప్రధానాచార్యులు శ్రీనివాసరెడ్డి, వివిధ జిల్లాల జడ్పీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి..

బాపట్ల అర్బన్: పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మొక్కల పెంపకంతో సాధ్యపడుతోందన్నారు. రెడ్‌క్రాస్ సభ్యులు ఉద్యమంగా చెట్లు నాటడం అభినందనీయమన్నారు. అదేవిధంగా స్పందన హాలులో గర్భిణులకు హైజీన్ కిట్లు, డీఎంహెచ్ఓ, డీఆర్ఓలతో కలిసి పంపిణీ చేశారు. జిల్లా రెడ్ క్రాస్ సంస్థ సభ్యులను అభినందించారు. జేసీ శ్రీధర్, డీఆర్ఓ లక్ష్మీశివ జ్యోతి, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ, డీఈఓపీ జె.రామారావు, రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

వేధింపులు.. బెదిరింపులు

- స్పందనలో ఎస్పీ ముందు ఆవేదన వ్యక్తం చేసిన బాధితులు
- అండగా ఉంటామంటూ భరోసానిచ్చిన ఎస్పీ వకుల్‌జిందాల్



జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్‌కు సమస్యలు చెప్పుకొంటున్న బాధితులు

బాపట్లటౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి సమస్యలు వెలువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 61 మంది బాధితులు నేరుగా ఎస్పీ వకుల్‌జిందాల్, అడిషనల్ ఎస్పీ పి.మహేష్‌లను కలిసి తమ సమస్యలను వివరించారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ వకుల్‌జిందాల్ సంబంధిత పోలీస్‌అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు.

భర్త వేధింపులు భరించలేకపోతున్నా..

నాకు 2022లో మహబూబ్ సుభానీతో వివాహం జరిగింది. ప్రస్తుతం నేను తొమ్మిదో నెల గర్భిణిని. నా భర్త వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని ఇంటికి తనకు ఇష్టమొచ్చినప్పుడు వస్తున్నాడు. నీవు నాకు అవసరం లేదు. ఇంట్లోనుంచి వెళ్లిపో...లేదంటే చంపేస్తానని బెదిరిస్తున్నాడు. నన్ను ఏం చేస్తాడోనని భయంగా ఉంది. నా భర్తతోపాటు మా అత్త కరీమూన్ కూడా నన్ను చిత్రహింసలకు గురిచేస్తుంది. నాకు న్యాయం చేయండి.

– షేక్ మస్తాన్, మార్టూరు

ప్రేమించి పెళ్లి చేసుకొని మోసం చేశాడు

నన్ను ఐదు సంవత్సరాల క్రితం రాజు అనే వ్యక్తి ప్రేమించి వివాహం చేసుకున్నాడు. కులాలు వేరుకావడంతో మా తల్లిదండ్రులను కూడా కాదని అతనివెంట వచ్చాను. ప్రస్తుతం నాకు ఇద్దరు ఆడపిల్లలు. నన్ను ఇంటివద్దనే వదిలి వేరే మహిళతో వేరేచోట కాపురం పెట్టాడు. కనీసం తిండికూడా పెట్టడం లేదు. పసిబిడ్డలను సాకేందుకు ఇబ్బందిపడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇదేమంటే నీవు అవసరం లేదు వెళ్లిపో అంటున్నాడు.. లేదంటే చంపేస్తానంటున్నాడు.

– మీసాల నిత్య, చీరాల

చంపేస్తానని బెదిరిస్తున్నాడు

నాకు సర్వేనెంబర్ 1160లో మూడు ఎకరాల రొయ్యల చెరువులు ఉన్నాయి. మా చెరువుల పక్కనే కొక్కిలిగడ్డ ఏడుకొండలకు చెరువులు ఉన్నాయి. నిత్యం మా చెరువులు ఆక్రమించాలనే దురుద్దేశంతో మాపై దాడులు చేస్తున్నారు. ఇటీవల మా చెరువులో విషపూరితమైన గుళికలు కలిపారు. ఈ విషయాన్ని చినగంజాం ఎస్ఐకు పలుమార్లు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మమ్ములను బెదిరిస్తున్నారు. మాకు ప్రాణహాని ఉంది.

– కొక్కిలిగడ్డ బాలమ్మ, పెదగంజాం

ఊళ్లోకి అడుగుపెడితే చంపుతామంటున్నారు

నాకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. నా భర్తను 2017లో అదే గ్రామానికి చెందిన సొంగ తేజ, ప్రకాశం, శాస్త్రి, క్రాంతి, విక్రమ్, బుజ్జి, వైద్యుల వలన నా భర్త చనిపోయాడు. దీనిపై అప్పటినుంచి కోర్టులో కేసు నడుస్తుంది. కోర్టులో ఉన్న కేసు రాజీ చేసుకుంటేనే ఊరిలో ఉండు లేదంటే నిన్నుకూడా చంపేస్తానని బెదిరిస్తున్నారు. నేను భయపడి నా బిడ్డలతో వేరే ఊరిలో అద్దెకు ఉంటున్నాను. వారి వలన నాకు ప్రాణహాని ఉంది. వారి చెరనుంచి నన్ను, నా బిడ్డల్ని కాపాడండి.

– సొంగ ప్రసన్న, ప్యాపర్రు

మానసిక సమస్యలతో బలవన్మరణం

రేపల్లె రూరల్: మానసిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని 7వవార్డులో చోటు సోమవారం చేసుకుంది. ఎస్ఐ అబ్దుల్ రజాక్ వివరాల మేరకు చిత్తూరు జిల్లా పీలేరు గ్రామానికి చెందిన బత్తుల సునీల్(26) గత మూడునెలల నుంచి రేపల్లె పట్టణంలోని 7వవార్డులో తన అన్నయ్య గోపీరాజు వద్ద నివాసం ఉంటున్నారు. కొంత కాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్న సునీల్ సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని మృతి చెందాడన్నారు. మృతునికి ఇంకా వివాహం కాలేదని, అతని అన్న గోపీరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు.



మృతుడు సునీల్

సత్తాచాటిన గుంటూరు జిల్లా ఎడ్లు

స్వర్ణలో రాష్ట్రస్థాయి పోల్‌రాధా ఎడ్ల పోటీలు



విజేత ఎడ్లజత యజమానికి బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

కారంచేడు: గ్రామ దేవత స్వర్ణమ్మతల్లి తిరునాళ్లను పరస్కరించుకొని ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి జూనియర్ నాటు ఎడ్ల పోల్‌రాధా (ఒంగోలు జాతి) పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన ఎడ్ల జత సత్తా చాటాయి. సోమవారం వేకువజాము వరకు జరిగిన పోటీల్లో నిర్ణీత 10 నిమిషాల వ్యవధిలో గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్య చౌదరికి చెందిన ఎడ్ల జత 2478.9 అడుగుల దూరం లాగి తన సత్తా చాటి మొదటి బహుమతిని (రూ.30,116లు) కైవసం చేసుకున్నాయి. రెండో బహుమతిని ప్రకాశం జిల్లా మడనూరుకు చెందిన బత్తుల వంశీకృష్ణారెడ్డికి చెందిన ఎడ్ల జత 2400 అడుగుల దూరం లాగి రూ.20,116 సంపాదించాయి. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం పగడంవారిపాలేనికి చెందిన కుంచాల వేదశ్రీ – లతా రెడ్డిలకు చెందిన ఎడ్ల జత 2179.5 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం రూ.12,116లు సాధించాయి. బాపట్ల జిల్లా పోతురాజు కొత్తపాలేనికి చెందిన కావూరు వెంకటేశ్వరరెడ్డికి చెందిన ఎడ్ల జత 2107.4 అడుగల దూరం లాగి నాలుగో స్థానం రూ1,116లు గెల్చుకున్నాయి. ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాలకు చెందిన 16 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొన్నాయి. విజేతలుగా నిలిచిన ఎడ్ల జతల యజమానులను నిర్వాహకులు ఘనంగా సత్కరించి బహుమతులు అందించారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

నిజాంపట్నం: జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు నిజాంపట్నం క్రీడాకారులు ఎంపికైనట్లు బోధిధర్మ తైక్వాండో అకాడమీ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం నిజాంపట్నంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఆయన అభినందించి మాట్లాడారు. ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు విజయనగరం జిల్లా కొత్తవలసలో జరిగిన స్టేట్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో నిజాంపట్నంకు చెందిన ఆరుగురు క్రీడాకారులు పాల్గొని ఆరు పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పతకాలు సాధించివారు పీతా వెంకట కార్తికేయ(బంగారు), సైకం యువరాజువర్మ (బంగారు), మోపిదేవి కౌశిక్(బంగారు), సైకం కార్తికేయ(రజితం), మోపిదేవి శరణ్య(రజితం), పీతా నాగతనూష(రజితం) పతకాలను సాధించినట్లు తెలిపారు. ఈ పోటీలకు కోచ్‌లుగా రోహింత్‌వర్మ, చేతన్ చౌదరి వ్యవహరించినట్లు తెలిపారు.



క్రీడాకారులను అభినందిస్తున్న అకాడమీ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు

219 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

చినగంజాం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా వేసి పట్టుకున్నారు. ఈ సంఘటన సోమవారం వేకువ జామున జరిగింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అందించిన సమాచారం ప్రకారం.. గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఈశ్వరరావుకు పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం బాపట్ల జిల్లా చీరాల నుంచి ఐషర్ మినీ లారీలో ప్రకాశం జిల్లా ఉప్పుగుండూరు గ్రామంలోని సాయి కార్తికేయ రైస్ మిల్లుకు తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. గుంటూరు జిల్లా రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం వేకువ జామున చినగంజాం మండలం సంతరావూరు గ్రామం వద్ద నిఘా వేసి లోడుతో వెళుతున్న మినీలారీని తనిఖీ చేశారు. లారీలో 219 బస్తాల పీడీఎస్ బియ్యం గుర్తించారు. డ్రైవర్‌ను విచారించగా చీరాలలోని 2 చౌక ధరల దుకాణాల నుంచి 219 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని లోడ్ చేసుకొని ఉప్పుగుండూరు సాయి కార్తికేయ రైస్ మిల్లులో దించేందుకు వెళ్తున్నట్లు తెలిపాడు. విజిలెన్స్ అధికారులు 219 బస్తాల పీడీఎస్ బియ్యం లారీతో సహా స్వాధీనం చేసుకొని చినగంజాం సివిల్ సప్లయిస్ డీటీని 6ఏ, క్రిమినల్ కేసు నమోదు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మరొక టీం చీరాల ప్రకాష్ నగర్ దండుబాట రోడ్డులో ఉన్న చౌక ధరల దుకాణాలు 32,33లను తనిఖీ చేయగా వాటిలో ఉండాల్సిన నిల్వలు కన్నా 62 మరియు 146 బస్తాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. షాపుల్లో ఉన్న 51.20 క్వింటాళ్ల సబ్సిడీ బియ్యం స్వాధీనం చేసుకొని రెండు షాపుల డీలర్‌లపై 6ఏ, క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిందిగా డీటీని ఆదేశించారు. స్వాధీనం చేసుకున్న లారీని చినగంజాం ఎస్ఐ సురేష్‌కు అప్పగించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అక్కిశెట్టి శ్రీహరిరావు, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎస్ఐ శ్రీరామచంద్రయ్య, సీఎస్ డీటీ గీత, సిబ్బంది పాల్గొన్నారు.



రేషన్ బియ్యం లారీని పోలీసులకు అప్పగిస్తున్న విజిలెన్స్ అధికారులు

పట్టుదలతో పోరాడితేనే లక్ష్యసాధన

చాంపియన్‌షిప్ సాధించిన తైక్వాండో క్రీడాకారులకు జిల్లా ఎస్పీ అభినందన

బాపట్లటౌన్: పట్టుదలతో పోరాడినప్పుడే లక్ష్యాలను చేరుకోగలరని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. 3వ ఏపీ స్టేట్ తైక్వాండో సబ్ జూనియర్ క్యాడెట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్ షిప్ 2023లో పతకాలు సాధించిన చీరాలలోని హంటర్ తైక్వాండో అకాడమీ విద్యార్థులను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అభినందించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి అనునిత్యం, అంకితభావంతో సాధన చెయ్యాలన్నారు. తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కొత్తవలసలో ఈనెల 2 నుంచి 4వ తేదీవరకు జరిగిన 3వ ఏపీ స్టేట్ తైక్వాండో సబ్ జూనియర్ క్యాడెట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్ 2023లో చీరాల పట్టణంలోని హంటర్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు రెండు స్వర్ణ పతకాలు, నాలుగు రజిత పతకాలు, రెండు కాంస్య పతకాలను సాధించి చాంపియన్ షిప్ సాధించారన్నారు. తైక్వాండోలో పతకాలు సాధించడం అంత సులువైనది కాదని, కోచ్‌లు అందించిన మెరుగైన శిక్షణ, మెలకువలతో పాటు విద్యార్థులు కఠోర శ్రమచేస్తేనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇదేవిధంగా అద్భుత ప్రతిభ కనబరిచి దేశ ప్రతిష్టను పెంచే విధంగా ప్రదర్శన చేయాలన్నారు. హంటర్ తైక్వాండో అకాడమీ నిర్వహకులు పి.సుబ్రహ్మణ్యం, ఎం.సురేష్, జి.శాంతి వరప్రసాద్ పాల్గొన్నారు.



తైక్వాండో క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

సినిమా షూటింగులకు పెనుమూడి అనుకూలం

సినీ దర్శకుడు దిలీప్ రాజా

రేపల్లె: అందమైన దృశ్యాలను చిత్రీకరించేందుకు పెనుమూడి కృష్ణానది తీరం అడ్డా అని సినీ దర్శకుడు దిలీప్ రాజా అన్నారు. తాను చిత్రీకరించే నూతన సినిమా లోకేషన్‌లు పరిశీలించే నిమిత్తం ఆయన సోమవారం పెనుమూడిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనుమూడి లొకేషన్లలో తన నూతన చిత్రంలో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గతంలో ప్రముఖ హాస్యనటుడు ఆలీతో తీసిన పండుగాడి ఫొటో స్టూడియోలో కూడా హీరోయిన్ ప్రతిరోజూ పల్లెటూరు నుంచి పడవ ఎక్కి పట్నంలోని కాలేజీకి వెళ్లే సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించానని దిలీప్‌రాజా గుర్తు చేశారు. పైగా తాను రేపల్లె కళాశాలలో డిగ్రీ చదివిన నేపథ్యంలో రేపల్లె పరిసర ప్రాంతాలపై పూర్తిగా అవగాహన ఉందన్నారు. అలాగే తాను చదివిన కాలేజీలో షూటింగ్ తీయాలనే చిరకాల వాంఛ ఈ సినిమాతో తీరుతుందని ఆయన పేర్కొన్నారు. పెనుమూడి కృష్ణానదిలో పడవలపై ఫైటింగ్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తానని చెప్పారు. నిజాంపట్నం హార్బర్, రేపల్లె ఓల్డ్ టౌన్‌లోని అంకమ్మ చెట్టు, నక్షత్ర నగర్, లంక గ్రామాల్లో షూటింగ్ జరుగుతుందని ఆయన వెల్లడించారు. జూలై నుంచి తొలి షెడ్యూల్ షూటింగ్ మొదలు అవుతుందని దిలీప్ రాజా చెప్పారు. ఆయన వెంట ఉత్తరప్రదేశ్ నటుడు అమీర్ చౌదరి, కెమెరామెన్ వంశీ ఉన్నారు.



పెనుమూడి కృష్ణానదిలో లొకేషన్‌లు పరిశీలిస్తున్న సినీదర్శకుడు దిలీప్‌రాజా

మొక్కల పెంపకంతోనే మానవాళి మనుగడ

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు

రేపల్లె రూరల్: చెట్ల పెంపకంతోనే మానవాళి తమ మనుగడను సాగించటం సాధ్యమవుతుందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు అన్నారు. అటవీశాఖ అవనిగడ్డ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ హిత జీవనశైలిపై మండలంలోని లంకెవానిదిబ్బ గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మనిషికి అవసరమైన ఆక్సిజన్ అందాలన్నా, వాతావరణ సమతౌల్యం కాపాడి ఓజోన్ పొర రక్షించబడాలన్నా చెట్ల పెంపకం తప్పనిసరి అన్నారు. విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజున ఒక మొక్కను నాటి దాని పెంచే బాధ్యతను స్వీకరించాలన్నారు. చెట్లను మనం రక్షిస్తే చెట్లు మనల్ని రక్షిస్తాయన్న విషయాన్ని మరువరాదన్నారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ త్రివూర్తులురెడ్డి, ఎఫ్ఆర్ఓ కేవీఎస్ రాఘవరావు, పంచాయతీ సెక్రటరీలు, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అబ్దుల్ రెహమాన్

ఓల్డ్‌టౌన్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో...

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఓల్డ్‌టౌన్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షేక్ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని నివారించే కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి ప్రజలకు ఓఆర్ఎస్, జింక్ ట్యాబెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ శ్రీలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.